


**'ఇందు ఉన్నవి లేనట్టు, లేనివి ఉన్నట్టు మా కళ్లకు అగుపించుచున్నవీ.. ఇది మయసభా? లేక మాయా సభా' అంటూ దుర్యోధనుడు మయసభలో భ్రమపడి, మోసపోయిన తీరు గుర్తుందిగా! ఎస్, అచ్చం అలాగే.. మీరూ మోసపోయే ప్రమాదం ఉంది. మెరిసేదంతా బంగారం కాదు. మీ మొబైల్‌లోకి వచ్చిపడుతున్న ప్రకటనలన్నీ నిజమైనవి కావు. ఈ కనికట్టును గుర్తించినప్పుడే మొబైల్ వినియోగదారులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ఉంటారు.**

# క్లిక్ చేస్తే చిక్కుల వలలోకి..

భారతదేశ జనాభా 140 కోట్లు. మొబైల్ ఫోన్ కనెక్షన్ల సంఖ్య 110 కోట్లకు పైమాటే. 62 కోట్లకు పైగా ఇంటర్నెట్ యాక్సెస్‌లు, సుమారు 45 కోట్ల సోషల్ మీడియా ఖాతాలు ఉన్నాయి. అంటే మనం తరచూ ఆన్‌లైన్ మోసాలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. కొన్ని ఆన్‌లైన్ ప్రకటనలు సైబర్ నేరాల్లో చిక్కుకోవడానికి సులభమైన మార్గంగా మారాయి. ఈ ఫేక్ ఆన్‌లైన్ యాడ్స్ ద్వారా డబ్బును దొంగిలించటం, ప్రతిష్ఠను దెబ్బ తీయడమే నేరగాళ్ల లక్ష్యం. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్లు సోషల్ మీడియా మాయగాళ్ల ఉచ్చులో పడకుండా తగిన జాగ్రత్తతో ఉండాల్సిన అవసరం ఉన్నది.

కొన్ని ఆన్‌లైన్ యాడ్స్ క్లిక్ చేస్తే మన బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు పోగొట్టుకునే అవకాశం ఉంది. ఈ-మెయిల్, వాట్సాప్, ఎస్ఎంఎస్, నకిలీ వెబ్‌సైట్లు, ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు ఆన్‌లైన్ మోసాలు, అప్లికేషన్ల ద్వారా ఆన్‌లైన్ మోసాలు జరుగుతాయి. బాట్‌లెట్‌లు, డేటా సెంటర్లు, బ్రౌజర్ టూల్ బార్‌లు, ఇన్‌ఫెస్డ్ సాఫ్ట్‌వేర్, క్లిక్ టు క్లిక్ వెబ్‌సైట్లు, ఉచిత యాప్‌లు, క్లిక్ ఫార్మ్‌లు అడ్వర్టయిజ్‌మెంట్ మోసాలకు మూలాలు అని చెప్పవచ్చు.

**మోసం తీరుతెన్నులు..**

**క్లిక్ జాకింగ్:** ఆన్‌లైన్ అడ్వర్టయిజ్‌మెంట్ మోసాల్లో ఒకటి 'క్లిక్ జాకింగ్'. అంటే హైజాకింగ్ లాగా మోసం జరుగుతుందన్న మాట. ఈ-మెయిల్ ద్వారానో, వాట్సాప్‌లోనో, ఫేస్‌బుక్‌లోనో, ఇన్‌స్టాలోనో, టెలిగ్రామ్‌లోనో మోసగాడి నుంచి యూజర్‌కు ఓ లింక్ వస్తుంది. దాంట్లో నిజమైన కంపెనీ పేరును కొద్దిపాటి మార్పుతో పేర్కొంటాడు మోసగాడు. దాన్ని చూస్తే అది.. నిజమైనదే అనిపిస్తుంది. కానీ, ఒరిజినల్ కాదు. ఉదాహరణకు 'అమెజాన్'ను తీసుకుంటే అసలు పేరులోని 'జెడ్' అక్షరం స్థానంలో 'జె' ఉంటుంది. దీన్ని వినియోగదారుడు గ్రహించడు. లింక్ రాగానే.. 'నిన్ననే కదా.. అమెజాన్‌లో ఆర్డర్ చేశాను. ఇది అదే కావొచ్చు' అనుకొని క్లిక్ చేస్తాడు. అప్పుడు ఆ లింక్ ద్వారా వినియోగదారుడు వేరే ఏదో మోసపూరిత వెబ్‌సైట్‌ను సందర్శిస్తాడు. అలా చివరికి మోసానికి గురవుతాడు. ఈ విధమైన లింక్ మోసాలు రెండు రకాలు. ఉచితంగా వెబ్‌సైట్ సందర్శించేలా చేసేది ఒకటైతే, పేమెంట్ చేసి సందర్శించాలని సూచిస్తూ మోసగించేవి రెండో రకం. ఆన్‌లైన్ పేమెంట్ చేస్తేనే ఫలానా బహుమతి పొందుతారనో, ఫలానా అవకాశం చేజారుతుందనో ఉంటుంది. అలాంటి పరిస్థితిలో కూడా వినియోగదారుడు నిర్ణీత మొత్తాన్ని చెల్లించి మరీ మోసపోతుంటాడు.

**ఫేక్ యాప్ అప్లికేషన్:** ఫుడ్ ఆర్డర్ చేసుకోడానికి ఓ యాప్, నిత్యావసర సరుకులకు మరో యాప్, సరదాగా ఆడుకోవడానికి ఇంకో యాప్. ఇంకో అడుగు ముందుకేసి ఆన్‌లైన్ ద్వారానే డబ్బు సంపాదించడానికైనా యాపే బాప్. ఇలా ఇంట్లోంచి కాలు బయటపెట్టకుండా యాప్‌లను ఉపయోగించే చాలా పనులు చక్కబెట్టుకుంటున్న రోజులివి. ఈ నేపథ్యంలో ఫేక్ యాప్ అప్లికేషన్లు సామాజిక మాధ్యమ వేదికపైకి దూసుకొస్తున్నాయి. నిజం చెప్పు తొడుక్కునేలోగా అబద్ధం ఊరంతా చుట్టేసి వచ్చిందనే సామెతలాగా ఒరిజినల్ యాప్‌ల కన్నా ఫేక్ అప్లికేషన్లు వేగంగా యూజర్లకు దగ్గరవుతున్నాయి. ఉదాహరణకు.. చాలాసార్లు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో 'సాలిటెయిర్' పేరుతో కనిపించే ఓ అడ్వర్టయిజ్‌మెంట్‌ను మనం చూడొచ్చు. వాస్తవానికి సాలిటెయిర్ అనేది అందరికీ నచ్చే గేమ్. ఇలాంటి క్రేజీ యాప్స్‌ను పోలిన ఫేక్ యాప్స్‌కు సంబంధించిన యాడ్స్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంటాయి. ఇదొక్కటే కాదు మిర్రర్ అప్లికేషన్ అని, ఇంకేదో గేమింగ్ అప్లికేషన్ అని ఒరిజినల్ అప్లికేషన్‌లాగే సేమ్ టు సేమ్ బొమ్మ ఉంటుందీ యాడ్స్‌లో. యూజర్ అక్కడే మోసపోతాడు. డౌన్‌లోడ్ చేసుకొని మోసపు కూపంలో పడిపోతాడు. ఆ మధ్య 'పింక్ వాట్సాప్' అని ఓ లింక్ వైరల్ అయింది. అదంతా ఉత్తిదే. అందరినీ ఫూల్ చేయడానికి సృష్టించిన ఓ ఫేక్ అప్లికేషన్ మాత్రమే.

**హైడెడ్ అడ్వర్టయిజ్‌మెంట్స్:** 'గోడలకు చెవులుంటాయ్.. తలుపులకు కళ్లుంటాయ్' అది నిన్నటి మాట. ఇప్పుడంతా మొబైలే ప్రపంచం కదా. అందుకే ఇప్పుడు గాడ్జెట్స్ యూజర్ల మాటల్ని 'బ్రౌజర్' వింటున్నది. వారి చేష్టల్ని గమనిస్తున్నది. అందుకే మీకు ఇష్టమైన వాటినే మీ కళ్ల ముందుకు తీసుకొస్తుంది! ఇంకా అర్థం కాలేదా? ఉదాహరణకు.. మీరు చెప్పుల కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తుంటే, అది మీ బ్రౌజర్‌కి తెలిసిపోతుంది. కొంగొత్త మోడ్రన్ చెప్పుల్ని మీ ముందు ప్రదర్శిస్తుంటుంది. ఇలా బ్రౌజింగ్ చేస్తూ హైడెడ్ అడ్వర్టయిజ్‌మెంట్స్‌ను చూస్తుంటాం. ఈ నేపథ్యంలో లెజిటిమేట్ (చట్టబద్ధమైన) అడ్వర్టయిజ్‌మెంట్స్ వెనుక ఫేక్ లింక్‌లు పెట్టి మోసపోయేలా చేస్తారు. వినియోగదారులు కోరుకునే బ్రాండ్‌కు సంబంధించిన బొమ్మనే అక్కడ డిస్‌ప్లే అవుతుంది. క్లిక్ చేస్తే ఫేక్ లింక్‌లోకి చేరిపోతుంటారు. నిర్ణీత అడ్వర్టయిజ్‌మెంట్స్ చూస్తేనే డబ్బులు వస్తాయి. మీరు పాల్గొనాలంటే నిర్ణీత ఫామ్ ఫిలప్ చేయాల్సిందే. ఇది క్లిక్ చేస్తేనే అవార్డు వస్తుంది.. ఇలా ఎన్నెన్నో మోసాలు జరుగుతుంటాయి. చివరగా.. ఏ అప్లికేషన్ అయినా ఇన్‌స్టాల్ చేసుకోవాలంటే ప్లే స్టోర్‌లోకి వెళ్లాలి లేదా యాప్ స్టోర్‌లో ఉంటుంది. ఇది గుర్తుంచుకుంటేనే లింక్‌ల వలలో చిక్కుకోకుండా ఉంటారు. ■

**బాట్‌నెట్ అడ్వర్టయిజ్‌మెంట్ ఫ్రాడ్స్:** ఈ రోజుల్లో క్వాలిఫికేషన్లు, హోదాలు, సమాజంలో ఉన్న స్థాయిలతో పనిలేకుండాపోయింది. సోషల్ మీడియాలో ఎంతమంది ఫాలోవర్స్ ఉంటే అంత గ్రేట్ అనుకునే వాళ్లే ఎక్కువ. ఈ పరిస్థితి కూడా మోసాలకు రాచమార్గం అవుతున్నది. తనను అనుసరించేవారి సంఖ్య లక్షల్లో కనిపించేలా ఫేక్ ఫాలోవర్స్‌ను సృష్టించుకుంటాడు. ఇదేమీ తెలియక అమాయక యూజర్లు 'ఇంత ఎక్కువ మంది ఫాలో అవుతున్నారంటే ఎంతో గొప్పోడు అయి ఉండాలి..? అతను చెప్పేది అబద్ధం అవుతుందా?..' అని ఫాలో అయిపోయి మోసపు కుహరంలోకి ప్రవేశిస్తారు.



**అనిల్ రాచమల్ల**
వ్యవస్థాపకులు
ఎండ్‌నౌ ఫౌండేషన్